జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 20 | డిసెంబర్ | 2025 ♦ పేజీలు : 5



# ఏపీలో కలిపిన ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలి

- కొత్తగూడెంలో సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి కోసం మంత్రులు కృషి చేయాలి
- ఓసీ-2 మైన్‌ను ప్రయివేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటాం
- భద్రాద్రిలో జాగృతి అధ్యక్షురాలు కల్వ కుంట్ల కవిత వెల్లడి

**భద్రాచలం, డిసెంబర్ 19, ప్రజాజ్యోతి :** తెలంగాణ నుంచి ఏపీలో కలిసిన భద్రాచలం మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలను తక్షణమే తెలంగాణలో విలీనం చేసేందుకు రెండు రాష్ట్రప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. భద్రాచలంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికే జనం బాట పట్టానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులు, ఆదివాసీలను నిర్లక్ష్యం చేస్తోందని వారిని మభ్యపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చారన్నారు. గిరిజన కార్పోరేషన్‌లో 30 ఏళ్లుగా రిక్రూట్‌మెంటు లేవని, కొత్తగూడెంలో తక్షణమే సూపర్ స్పెషాల్టీ వైద్యశాల ఏర్పాటు చేయాలన్నారు. ఓసీ మైన్‌ను ప్రయివేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని, సింగరేణి కార్మికుల సమస్యలపై జాగృతి నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అలాగే భద్రాచలం రామాలయంకు సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తానన్న నిధులు వెంటనే

మిగతా 2 లో...






# విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ లకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి..

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 19, ప్రజాజ్యోతి:** వరదలు, పరిశ్రమలలో సంభవించే ప్రమాదాలను సమర్ధవంతంగా నియంత్రించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధించి జిల్లాల్లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మాక్ ఎక్సర్సైజ్‌లు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ (ఎన్‌డిఎంఏ) ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, ఎన్‌డిఎంఏ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులకు వరదలు, పరిశ్రమ ప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వీడియో అవగాహన

2 లో...

# బీజాపూర్ లో ఎన్ కౌంటర్

♦ మావోయిస్టు ఏరియా కమాండర్ మృతి




**చర్ల, డిసెంబర్ 19 (ప్రజాజ్యోతి):** ఛత్తీస్ గఢ్ లోని బీజాపూర్ జిల్లాలోని భైరామ్ గఢ్ పోలీస్ స్టేషన్ లోని ఇంద్రావతి ప్రాంతంలోని అటవీ కొండలలో డీఆర్ జీ బీజాపూర్ మావోయిస్టుల మధ్య శుక్రవారం ఉదయం నుండి అడపాదడపా కాల్పులు జరిగాయి .బీజాపూర్ జిల్లాలోని భైరామ్ గఢ్‌పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి ప్రాంతంలోని అద్వాడా-కోట్ మెటా అడవుల్లో మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం ఆధారంగా బీజాపూర్ డీఆర్ జీ సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు.బీజాపూర్ పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ జితేంద్ర యాదవ్ మాట్లాడుతూ ఈ ఆపరేషన్ శుక్రవారం ఉదయం 06.00గంటల నుండి బీజాపూర్ డిఆర్జి దళాలు మావోయిస్టుల మధ్య అడపాదడపా కాల్పులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు సెర్చ్ ఆపరేషన్ సమయంలో ఒక మావోయిస్టు మృతదేహం, .303 రైఫిల్, 9ఎం ఎం పిస్టల్ తో పాటు

మిగతా 2 లో...

# రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యత

**ఇల్లందు, డిసెంబర్ 19, ప్రజాజ్యోతి:** రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు నేతృత్వంలో ఇల్లందు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి మనం చేసిన రక్తదానమే ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ రక్తదాన శిబిరంలో మున్సిపల్ సిబ్బంది, ఇల్లందు పట్టణ ప్రజలు కలిసి 110 దాతలకు పైగా

మిగతా 2 లో...





# గిరిజనులు ఆర్థికంగా స్థిరపడాలి

- గిరిజన మహిళలే ర్యాంపులు నడుపుకోవాలి
- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

**చర్ల, డిసెంబర్ 19:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం గొమ్ముగూడెం గ్రామంలోని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన గిరిజన మహిళలు నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపును ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సందర్శించి ఇసుకతోడే యంత్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా సొసైటీ మహిళలతో ఆయన మాట్లాడుతూ

మిగతా 2 లో...

## ఏపీలో కలిపిన ఐదు గ్రామ పంచాయతీ లను తెలంగాణలో విలీనం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు. సీతారామ పంప్‌హౌజ్‌ను స్వయంగా వెళ్లి పరిశీలించానని ఒక్క ఎకరాకు కూడా నీళ్లు రావడం లేదని, నాగార్జునసాగర్ నీళ్లు వస్తున్న చోటకే సీతారామ ద్వార నీళ్లు వచ్చేలా చేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు రూ.7 వేల కోట్లతో మొదలై రూ.13 వేలు కోట్ల నుంచి ఇప్పుడు రూ.19 వేల కోట్లకు చేరిందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా కొత్తగూడెం జిల్లాకు నీళ్లు వచ్చే ఏర్పాట్లు చేయలేదన్నారు. భద్రాచలం నుంచి విడిపోయిన ఏపీలో కలిసిన గ్రామాల వారికి ఆరోగ్యశ్రీ వర్తించడం లేదని, తక్షణ రిలీఫ్‌గా ఆరోగ్యశ్రీ వర్తించేలా చేయాలన్నారు. రాములోరి మాన్యంను కాపాడుకోవాలంటే పురుషోత్తపట్నంలో రిటైనింగ్ వాల్ కట్టాల్సిందేనని, దీని కోసం బీజేపీ ఎ ంపీలు, పెద్ద నేతలు ప్రయత్నం చేయాలని కోరారు. అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు ద్వారా తెలంగాణలో మూడువేల ఎకరాలు, ఏపీలో 13 వేల ఎకరాలు సాగవుతోందని, కాని రిపేరు మాత్రం ఏపీ ప్రభుత్వం పంతానికి పోయి ముందుకు రావడం లేదన్నారు. దీంతో తెలంగాణ రైతులు ఇబ్బందులు పడుతున్నారని కేవలం రూ.2 కోట్లతో సమస్య పరిష్కారమయ్యేదాన్ని ఇంతకాలం సాగదీస్తున్నారని పేర్కొన్నారు. పినపాకలో పాలిటెక్నిక్, మణుగూరులో బస్టాండు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతన్నారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కవిత ఐదు గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో ముఖాముఖి మాట్లాడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విభజన అనంతరం వారు ఎదుర్కొంటున్న సమస్యలను కవితకు వివరించారు. అనంతరం కవిత భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బీజాపూర్ లో ఎన్ కౌంటర్



(మొదటి పేజీ తరువాయి...)

పేలుడు పదార్థాలు మావోయిస్టు సామగ్రిని ఎన్ కౌంటర్ స్థలం నుండి స్వాధీనం చేసుకున్నాము అని అన్నారు .పోలీసులు –మావోయిస్టుల కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టును గుర్తించారు . వివరాలు ఏ సి ఏం ఫగ్ను మద్వి ఏ సి ఏం భైరామ్ గఢ్ ఏరియా కమిటీ, అతనిపై 5 లక్షలు రివార్డ్ ప్రకటించారు . **స్వాధీనం చేసుకున్న ఆయుధాలు ఇతర సామగ్రి:** ఘంటా స్థలం నుండి 303 రైఫిల్, ఒక మ్యాగజైన్, ౦౩ రౌండ్లు 9ఎం ఏం పిస్టల్, ఒక మ్యాగజైన్, 09 రౌండ్లు స్కానర్ సెట్, రెండు రేడియోలు , మెడికల్ కిట్, కార్డెక్స్ వైర్, పిస్టల్ పౌచ్, మావోయిస్టు కరపత్రాలు మొదలైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.2025లో భద్రతా దళాల ప్రభావవంతమైన సమన్వయంతో కూడిన చర్య ఫలితంగా, బస్తర్ లో మావోయిస్టు ఇప్పుడు చివరి దశలో ఉందని బస్తర్ రేంజ్ ఐజీపీ శ్రీ సుందర్ రాజ్ పట్టలింగం పేర్కొన్నారు. మావోయిస్టు సంస్థ యొక్క మొత్తం నిర్మాణం కూల్చివేయబడిందని హింస వ్యాప్తి చేయడానికి వారు చేసే ఏ ప్రయత్నాలు ఇప్పుడు ప్రభావ వంతంగా లేవని ఆయన పేర్కొన్నారు. హింసా మార్గాన్ని విడిచిపెట్టి, ప్రభుత్వ లొంగుబాటు పునరావాస విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐజీపీ అన్ని క్రియాశీల మావోయిస్టులకు విజ్ఞప్తి చేశారు.

## రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యత



(మొదటి పేజీ తరువాయి...)

రక్తదానం చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి, అంబులెన్స్ గురించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళగా ఐటీడీఏ ద్వారా పనులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, సూపరిండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, ఆర్ యంఓ డాక్టర్ రామ్ నివాస్, డాక్టర్లు బన్సీ, శేఖర్, వైద్య సిబ్బంది, మున్సిపల్ డిఈ మురళీ, ఆర్ఐ శ్రీనివాస్, మెప్మా, మున్సిపల్ సిబ్బంది, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ డానియల్, సర్పంచులు పాయం లలిత, బానోతు శారద, నాయకులు అంకెపాక నవీన్, అజామ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ లకు...

# ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)



సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మలతో కలిసి ఐ డి ఓ సి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఎన్‌డిఎంఏ అధికారులు మాట్లాడుతూ, జిల్లాలలో వరదలు లేదా పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు అధికార యంత్రాంగం వేగంగా, సమన్వయంతో స్పందించేందుకు ముందస్తు సిద్ధత ఎంతో అవసరమని తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి జిల్లాలో విపత్తుల నిర్వహణకు సంబంధించిన మాక్ ఎక్సర్సైజ్‌లు నిర్వహించి, అందుకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే సమీక్షించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ... , ఇటీవల వాతావరణ మార్పుల కారణంగా తక్కువ సమయంలో భారీ వర్షాలు కురిసి ఆకస్మిక వరదలు సంభవిస్తున్నాయని, వీటి వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. వరదల సమయంలో ప్రజలకు సకాలంలో సహాయం, పునరావాసం, పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు ప్రణాళికాబద్ధంగా సిద్ధంగా ఉండాలని తెలిపారు. అలాగే పరిశ్రమ ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు పాటించాల్సిన ప్రామాణిక విధానాలపై (ఎస్.ఓ.పి.) స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి పరిశ్రమలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ , గోదావరి పరివాహక ప్రాంతంలో వరదలు సంభవించినప్పుడు జిల్లాలో చేపడుతున్న ముందస్తు తక్షణ చర్యలను వివరించారు. వరదల అంచనాల విధానం, ముందస్తు హెచ్చరికల జారీ, కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు, పునరావాస కేంద్రాల నిర్వహణ, లోతట్టు ప్రాంతాలలో శాశ్వత పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ అధికారులకు వివరించారు. అనంతరం కలెక్టర్ అధికారులకు జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ సూచనలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వరదలు, పరిశ్రమలలో సంభవించే భారీ ప్రమాదాల సమయంలో అధికార యంత్రాంగం సమన్వయంతో స్పందించేలా మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, మిషన్ భగీరథ ఈఈ నలిని, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, ఇరిగేషన్ ఈజీ అర్జున్ రావు, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నాగేశ్వరరావు, డి సెక్షన్ సూపర్డెంట్ వెంకటేశ్వర్లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పెదవాగు ప్రాజెక్టు పట్ల

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు

**ఆయకట్టు రైతులు అధైర్య పడవద్దు**

**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలతో మాట్లాడతా**

**నాసిరకం పామాయిల్ మొక్కలతో నష్టపోయిన రైతులు ఆదుకోవాలి... కల్వకుంట్ల కవిత..... తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు**



**అశ్వారావుపేట, డిసెంబర్ 19, ప్రజాజ్యోతి :** ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలు పెదవాగు ప్రాజెక్టు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని రైతు సంక్షేమం పట్టని ప్రభుత్వాలు నిలబడవని పెదవాగు ప్రాజెక్టు తెగిపోయి 17 నెలలు కావస్తున్నా స్పందించకపోవడం దారుణమని ఈ ప్రాంత రైతుల పక్షాన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం ఆమె మండలంలో విస్తృతంగా పర్యటించారు ముందుగా వినాయకపురం గ్రామంలో నాసిరకం పామాయిల్ మొక్కలతో నష్టపోయి కాపు కాయని చెట్లను నరికి వేసిన ఆయిల్ ఫామ్ రైతు ప్రసాదు ఆయిల్ ఫామ్ తోటలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట దిగుబడి రాని ఆయిల్ ఫామ్ మొక్కలను రైతులకు ఆయిల్ ఫేడ్ సంస్థ అందించిందని అందుకు వారు నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆమె పెదవాగు ప్రాజెక్టును పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడారు. రెండు రాష్ట్రాల పరిధిలోని రైతులు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వాలు స్పందించడం లేదని ఆయకట్టు రైతుల బాధలు వింటుంటే బాధ కలుగుతుందన్నారు. వీలైనంత త్వరగా ప్రాజెక్టును పునర్నిర్మించి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వంలో ముగ్గురు మంత్రులు ఉన్నారని జిల్లాకు అవసరమైన నిధులు పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నారన్నారు. జాగృతి జండాను ఆమె మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో కాకతీయ గేట్ వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు, ఆమె అభిమానులు, రైతులు,తదితరులు పాల్గొన్నారు

## గిరిజనులు ఆర్థికంగా స్థిరపడాలి





(మొదటి పేజీ తరువాయి...)

ఐటీడీఏ భద్రాచలం పరిధిలో ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్న గిరిజన మహిళలు కాంట్రాక్టర్లను, బినామీలను నమ్మి ఇసుక ర్యాంపుల నిర్వహణ వారికి అప్పగించకుండా మహిళలందరూ ఐకమత్యంగా ఉండి గోదావరిలో నుండి ఇసుక వెలికితీత నిర్వహణ బాధ్యత, ఉత్పత్తి స్థాయిలో ఏజెన్సీ ప్రాంతంలోని ఆయా గ్రామాల పరిధిలో ఉన్న సొసైటీలు సొంతంగా ఇసుక ర్యాంపులు నిర్వహించు కోవడానికి, తద్వారా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది జీవనోపాధి పెంపొందించుకోవాలని, ఇసుక ర్యాంపులు నిర్వహించే మహిళలు ఆ గ్రామానికి సంబంధించిన వారే ఉండాలని, బినామీలను ఎవరిని దరిచేరకుండా చూడాలని, ఇసుక సరఫరాకు సంబంధించిన ప్రతిదీ రిజిస్టర్లో నమోదు చేయాలని ఆయన మహిళలకు సూచించారు. మహిళలు ఇసుక ర్యాంపుల పూర్తి బాధ్యత తీసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన అన్నారు.ఇసుక ర్యాంపులు సొంతంగా నిర్వహించుకునే గిరిజన మహిళలకు సాంకేతిక సహకారం ఆర్థిక సహకారం అందిస్తామని, పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఇసుక సొసైటీ మహిళల పనితీరును చూసి మిగతా సొసైటీ మహిళలు ఇసుక ర్యాంపులు సమర్థవంతంగా నిర్వహించుకునేలా ఉండాలని, ఇసుక ర్యాంపుల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకొని రావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పిసా స్పెషల్ ఆఫీసర్ అశోక్ కుమార్,తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శంకర్ నాయక్, ఏడి మైన్స్ దినేష్ కుమార్ సొసైటీ మహిళలు పాల్గొన్నారు.

# 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం కృషి



**ఇల్లందు, డిసెంబర్ 19, ప్రజాజ్యోతి:** రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు బీసీ సంఘం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని ఆ సంఘ నాయకులు దండు సారయ్య, దండ రామచందర్, మునుగునూరి రమేష్ గౌడ్ లు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఏక్తా హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జాతీయ బీసీ ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఇల్లందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, ఏక్తా హౌస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మడత వెంకట్ గౌడ్ ను జాతీయ బీసీల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్ గా నియమించడం సంతోషకరమన్నారు. పట్టణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే మడత వెంకట్ గౌడ్ కు ఇలాంటి పదవి ఇవ్వడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నేడు ఉదయం మడత వెంకట్ గౌడ్ కు అభినందన సభతో పాటు ఉద్యమ కార్యాచరణ సభలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జాతీయ బీసీ ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ ఉద్యమ విద్యార్థి జేఏసీ రాష్ట్ర చైర్మన్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ భపాషా, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ బుర్ర సోమేశ్వర్ గౌడ్ నువ్వు హాజరుకానున్నట్లు, బీసీ కులస్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అదేవిధంగా జాతీయ బీసీల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ 60వ పుట్టినరోజులు పురస్కరించుకొని పాత బస్టాండ్ లోని ఐతా ఫంక్షన్ హాల్ లో జన్మదిన వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మడత వెంకట్ గౌడ్ జన్మదిన వేడుకలకు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ఏక్తా హౌస్ సభ్యులు మునాఫ్, బాణాల శ్రీనివాస్, బండి సతీష్, కోటగిరి రాజేందర్, శనిగారపు రమేష్, బానోత్ స్వామి నాయక్, శేషు, గోపి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా లో పెన్షన్ అదాలత్, ట్రైపార్టైట్, ప్రయాస్ మీటింగ్



**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 19 – ప్రజాజ్యోతి:** సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని మాజీ ఉద్యోగుల పెన్షన్, సీఎంపిఎఫ్ సమస్యల పరిష్కారం కోసం కొత్తగూడెం ఏరియా ఇంచార్జ్ జిఎం అధ్యక్షతన అధ్యక్షతన సీఎంపిఎఫ్ ఆధ్వర్యంలో ఆర్.సి.ఓ.ఏ క్లబ్, రుద్రంపూర్ లో పెన్షన్ అదాలత్, ట్రైపార్టైట్, ప్రయాస్ మీటింగ్ సమావేశం నిర్వహించారు. ముందుగా కొత్తగూడెం ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ ఎం.వి. నరసింహారావు, రీజినల్ కమిషనర్ సీఎంపిఎఫ్ ఏం.కనకమ్మ, కే. వంశీధర్ లు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. తదనంతరం కొత్తగూడెం ఏరియాలోని మాజీ ఉద్యోగుల పెన్షన్, సీఎంపిఎఫ్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సీఎంపిఎఫ్ మాట్లాడుతూ... పెన్షన్ తీసుకుంటున్న మాజీ ఉద్యోగులు వారి యొక్క బ్యాంక్ అకౌంట్ ను ఫార్మర్ సర్వేయర్ గా మార్చుకొని వారి యొక్క నామిని మాజీ ఉద్యోగి భార్య ఆధార్ కార్డు ను సీఎంపిఎఫ్ ఆఫీస్ లో సమర్పించి మాజీ ఉద్యోగి మరణాంతరం విడో పెన్షన్ కు ఎలాంటి జాప్యం జరగకుండా పెన్షన్ పొందుటకు అవకాశం ఉంటుందని తెలియజేశారు. అలాగే కొత్తగూడెం ఏరియాలో పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు, సీఎంపిఎఫ్ క్లెయిమ్ సెటిల్మెంట్ చేసే సంబంధిత సిబ్బందితో ప్రాయాస్ అనే కార్యక్రమం పై మీటింగ్ నిర్వహించి సి–కేర్ పోర్టల్ ద్వారా క్లెమ్ సెటిల్మెంట్ కు సంబంధించి వివిధ విషయాలను క్షుణ్ణంగా చర్చించి సీఎంపిఎఫ్ క్లెయిమ్స్ సెటిల్మెంట్ కొరకు సి–కేర్ పోర్టల్ లో సంబంధిత సింగరేణి సిబ్బంది అప్లోడ్ చేస్తున్నప్పుడు ఉత్పన్నమవుతున్న సమస్యలను ఈ కార్యక్రమంలో నివృత్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీఎంపిఎఫ్ కమిషనర్స్ మాట్లాడుతూ... ప్రాయాస్ మీటింగ్ రెగ్యులర్ గా సింగరేణి పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు మరియు సంబంధిత సీఎంపిఎఫ్ సెటిల్మెంట్ చేసే సిబ్బందితో క్లెయిమ్స్ సెటిల్మెంట్ లను త్వరితగతిన పూర్తి చేయడం కొరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు అలాగే సీఎంపిఎఫ్ క్లెయిమ్ త్వరితగతిన సీ–కేర్ పోర్టల్ ద్వారా జీరో పెండెన్సీ తో సిఎంపీఎఫ్ క్లెయిమ్స్ ను సెటిల్మెంట్ చేస్తున్న కొత్తగూడెం ఏరియా మేనేజ్మెంట్ ను అభినందించారు. సీ–కేర్ పోర్టల్ ద్వారా ఈ యొక్క కార్యక్రమానికి హాజరైన మాజీ ఉద్యోగుల అప్లికేషన్లను తీసుకొని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలియజేయడం జరిగింది, మరియు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి పెన్షన్ అదాలత్ నిర్వహిస్తామని మాజీ ఉద్యోగులు హాజరై తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిఎం ఎం.వి. నరసింహారావు తో పాటు సీఎంపీఎఫ్ కమిషనర్స్ కే. వంశీధర్, ఎం.కనకమ్మ, అసిస్టెంట్ కమిషనర్ పి. చిరంజీవి, కొత్తగూడెం ఏరియా ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె. గట్టయ్య, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఎజిఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, ఎజిఎం( ఫైనాన్స్) ఈ.భీబస్తా, డివై పిఎం జి. హరీష్, సీనియర్ పిఓలు ఎం. మురళి, మతిన్, కే.శ్రీనివాసరావు, మేనేజ్మెంట్ ట్రైనీ (పర్సనల్) షాకీల్, శ్వేత, ఆంథోనీ సబ్బాస్టిన్ విక్టర్, కొత్తగూడెం ఏరియాలోని మైన్స్ అండ్ డిపార్ట్మెంట్ లోని సంబంధిత పెన్షన్ సెటిల్మెంట్ సిబ్బంది, మాజీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వార్డు ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగించినందుకు ధన్యవాదాలు



**ఇల్లందు, డిసెంబర్ 19, ప్రజాజ్యోతి:** మండలంలోని బాలాజీ నగర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో రెండవ వార్డు సభ్యులుగా ప్రజలు తనకు ఓట్లు వేసి ప్రజా సేవ చేసే భాగ్యం కలిగించినందుకు 2వ వార్డు సభ్యుడు వల్లాల రంజిత్ ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం రెండో వార్డు పరిధిలో విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తన పట్ల రెండవ వార్డు ప్రజలకు నమ్మకం ఉన్నందుననే ఎంతో మంది పోటీలో ఉన్నప్పటికీ తనకు ఓట్లు వేసి గెలిపించడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో, సర్పంచ్ ఆధ్వర్యంలో 2వ వార్డును అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతానని పేర్కొన్నారు.

## కల్తీ సారాతో వ్యక్తి మృతి

**చర్ల, డిసెంబర్ 19(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం నాటు సారా తాగి వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే గొమ్ముగూడెం గ్రామానికి చెందిన ఒల్లే. చంద్రం వయసు 40సం" నాటుసారాకు బానిసగా మారి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆ వ్యక్తి గురువారం రాత్రి నాటుసారా సేవించి శుక్రవారం ఉదయం మృతి చెందారు . అతనికి తల్లి, తండ్రి, భార్యా, పిల్లలు ఎవరు లేక పోవడంతో గత కొన్ని సంవత్సరాలుగా ఒంటరిగా జీవిస్తున్నాడు.మృతుని బంధువులు పల్లెల్లో విచ్చలవిడిగా నాటుసారా అమ్మకాలు జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే లేక పోవడంతో వారి వ్యాపారం మూడు సీసాలు ఆరు కాయలు అన్న చందంగా నాటుసారా కొనసాగుతోందని విమర్శించారు. ఇటీవల కాలంలో గొమ్ముగూడెం గ్రామంలో నాటుసారా తాగి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని తెలిపారు.కల్తీ సారా సేవించినందునే చంద్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.నాటుసారా అమ్మకాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా కుల పెద్ద సంకపాప. గణపతి మాట్లాడుతూ గ్రామంలో నాటుసార అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని యువత ఎక్కువగా నాటు సారాకు బానిసలు అయ్యారని గత కొన్ని సంవత్సరాలుగా నాటసార సేవించి అనేకమంది మృతి చెందారని మరో 10 మంది మృతి చెందడానికి సిద్ధంగా ఉన్నారని గ్రామంలో నాటు సారా అమ్మే వ్యక్తుల పేర్లను బహిరంగంగా ప్రకటించారు . మోట్ల. లక్ష్మి, కోట్ల. నాగలక్ష్మి, బట్టి. అమ్మాజీ ఎంతోమంది మృతికి కారణమవుతున్న వీరిని ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు .



## నేటి నుండి జనవరి 19వ వరకు డోర్ డెలివరీ మాసోత్సవాలు



**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 19, ప్రజా జ్యోతి:** ఏపీఎస్ఆర్టీసీ కార్గో పార్సెల్ సర్వీస్ లో డోర్ డెలివరీ బాషోత్సవాలు ఈనెల 20వ తేదీ నుండి జనవరి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పాల్వంచ ఏపీఎస్ఆర్టీసీ కార్గో సర్వీస్ ఏజెంట్ యడ్లపల్లి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 84 పట్టణాలలో 50 కేజీల వరకు బరువైన వస్తువులను పది కిలోమీటర్ల దూరం వరకు డోర్ డెలివరీ సౌకర్యం కల్పించబడిందన్నారు, క్రిస్మస్, జనవరి 1 సంక్రాంతి పండుగల సందర్భంగా ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు.

## పెద్దమ్మతల్లికి ఘనంగా పంచామృతాభిషేకం



**పాల్వంచ (టౌన్),డిసెంబర్ 19(ప్రజా జ్యోతి ):** పెద్దమ్మగుడిలో అమ్మవారికి ఘనంగా పంచామృతాభిషేక కార్యక్రమం నిర్వహించారు.ముందుగా మేళతాళాల మధ్య దేవస్థాన అర్చకులు,భక్తులు జన్మస్థలం వద్ద అమ్మవారికి పంచామృతాలు,పసుపు,కుంకుమ, గాజులు,హారతి సమర్పించారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## మానవసేవే మాధవసేవ ... అన్నదానం మహాదానం

- కొత్వాల శ్రీనివాసరావు




**పాల్వంచ(టౌన్),డిసెంబర్ 19(ప్రజా జ్యోతి ):** మానవ సేవే భగవంతుని సేవ అని, ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దానిలో కొంత భాగాన్ని పేదలకు సహాయం చేయడానికి వినియోగించాలని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్,డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని నటరాజ్ సెంటర్‌లో శుక్రవారం పితృ అమావాస్య సందర్భంగా కొంతమంది దాతల సహకారంతో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, అన్నదానం మహాదానమని,ఆకలితో ఉన్న వారికి భోజనం అందిస్తే భగవంతుని కృప తప్పక లభిస్తుందన్నారు.గత నాలుగు నెలలుగా ప్రతి పితృ అమావాస్య రోజున సుమారు 300 మంది పేదలకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా అయ్యగారికి స్వయంపాకం కూడా సమర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఎర్రం శెట్టి ముత్తయ్య,పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, కాంగ్రెస్ నాయకులు ఉండేటి శాంతి వర్ధన్ పాల్గొన్నారు.అలాగే మానవసేవే మాధవ సేవ కార్యక్రమ నిర్వాహకులు బ్రహ్మశ్రీ బండారు సత్యనారాయణ చారి,శ్రీనివాసాచారి,గుత్తా శివన్నారాయణ,తొర్లికొండ సత్యం, దాసరి రాజు,నరసింహారావు, వెంకటేశ్వరరెడ్డి,రామాచారి, వీరాచారి తదితర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మెగా లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

- రాజీయే రాజమార్గం- బోడు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి



**టేకుల పల్లి, డిసెంబర్19, ప్రజా జ్యోతి:** రాజీ మార్గమే – రాజ మార్గం" అనే నినాదంతో ఈ నెల 21 న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై శ్రీనివాసరెడ్డి పిలుపు నిచ్చారు.కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవడానికి ఇదొక సువర్ణావకాశమని ఆయన పేర్కొన్నారు.జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన, ఇరువైపుల సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందని తెలిపారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం,కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్,మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసు లు,బ్యాంకు రికవరీ కేసులు,విద్యుత్ చౌర్యం తదితర కేసులు పరిష్కరించుకోవచ్చు అని వివరించారు. కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని అన్నారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు.

## మండల అధికారులను కలిసిన కృష్ణ సాగర్ సర్పంచ్,ఉప సర్పంచ్



**బూర్గంపహాడ్,డిసెంబర్19 (ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జమలారెడ్డిని కృష్ణసాగర్ సర్పంచ్ తాటి వాణి,ఉప సర్పంచ్ భూక్య మోహన్ రావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐలు మేడ ప్రసాద్,నాగ భిక్షం లను కలిశారు.లక్ష్మీపురం గ్రామంలో మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ ఎత్తివేయడానికే కుట్ర



**బూర్గంపహాడ్,డిసెంబర్19 (ప్రజా జ్యోతి):** పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు.శుక్రవారం బూర్గంపహాడ్ మండలం పాండవుల బస్తీలో ఉపాధి కార్మికులతో జి–రామ్–జీ పత్రాన్ని తగులబెట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అజివిక మిషన్ పేరుతో బిల్లును తీసుకు వస్తున్నారన్నారు. పథకాన్ని నీరుగార్చే ఉద్దేశంలో భాగంగానే ఈ బిల్లును తీసుకొస్తున్నారని ఆరోపించారు. 2014నుంచి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ క్రమంగా ఈ పథకాన్ని నీరుగారుస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు పథకం నుండి గాంధీ పేరును మాత్రమే మారుస్తున్నామని చెప్తూ నెమ్మదిగా ఈ పథకాన్ని రద్దు చేయాలని చూస్తున్నారని, ఇప్పటికైనా ఉపాధిహామీ బిల్లును మార్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బోయిన ఆదెమ్మ, బర్ల మాణిక్యం,గుమ్మడి గోవిందమ్మ, పుట్టి నాంచారమ్మ,పుట్టి చిట్టెమ్మ,నాని,లక్షి , బర్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ...

# ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తోటమల్ల రమణ మూర్తి



**చర్ల, డిసెంబర్ 19 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం చర్ల కు చెందిన రమణమూర్తి – వెంకటరమణ దంపతుల ద్వితీయ కుమార్తె తోటమల్ల భవ్యశ్రీ జన్మదినం సందర్భంగా వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం నిలయ విద్యార్థులకు భోజన ఏర్పాట్లతో పాటు వాటర్ గీజర్, 50 కేజీల బియ్యం వితరణగా అందచేసారు. ఈ సందర్భంగా వనవాసీ ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమణమూర్తి విద్యార్థులను ఉద్దేసించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తాము ఏమి కావాలో చిన్ననాటి నుండే లక్ష్యాన్ని నిర్దేసించుకొని ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాదించవచ్చని అన్నారు. ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ తనకు ఎంతగానో ఆకట్టుకుందని అందుకే తమ కుమార్తె జన్మదినం సందర్బంగా వితరణలను అందచేసామన్నారు. వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత మాట్లాడుతూ జన్మదినం, ఇతర శుభ, అశుభ కార్యక్రమాల సందర్భంగా డబ్బు వృదా చేయకుండా విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం అబినందనీయమని అన్నారు. వనవాసీ విద్యార్థులు శీతాకాలంలో చలికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి గీజర్ ను అందచేయడం అబినందనీయమని అన్నారు. సంస్ద ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్దిక సహకారం, ఇతర సౌకర్యాలను పొందదని కేవలం దాతల సహకారంతో నడుస్తుందని వెల్లడించారు. గిరిజనుల అభ్యన్నతి కొరకు సంస్ద దేశ వ్యాపితంగా విద్యార్ది నిలయాలను నిర్వహిస్తోందని తెలిపారు. వనవాసీ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ మాట్లాడుతూ వనవాసీ విద్యార్థులకు దాతలు అందచేస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలని దాతల నమ్మకాన్ని వమ్ముచేయకుండా చదువుపై దృష్టిసారించి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యతోనే వినయం విదేయత వస్తుందని, కుటుంబంలో ఒక్కరు చదువుకొని జీవితంలో స్దిరపడితే ఆకుటుంభం మొత్తం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అందుకే తాము విద్యపై దృష్టిసారించి పేద విద్యార్థులకు సహకారమందించడంతో పాటు వారిని ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు.

గిరిజన విద్యార్థుల సంక్షేమం, అభ్యున్నతి కొరకు పాటుపడే సంస్దకు దాతలు తమవం తు సహకారమందించి విద్యార్థుల జీ వితాలలో వెలుగులు నింపాలని విజ్ఞ ప్తి చేసారు. కార్యక్రమంలో నిల య క మిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, సభ్యులు లవన్ కుమార్ రెడ్డి, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి, తోటమల్ల కృష్ణారావు, కొంగూరి సత్యం, చిట్టిమల్ల మురళీ పాల్గొన్నారు.

## జిపిఎస్ పాఠశాల ఆకస్మిక తనిఖీ

- పునాది నుంచే విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి
- ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలను బోధించాలి
- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్





**చర్ల, డిసెంబర్ 19 (ప్రజా జ్యోతి ) :** చర్ల మండలంలో శుక్రవారం మారుమూల దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న తిమ్మిరి గూడెం జిపిఎస్ పాఠశాలను ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భగా పిల్లలకు ఉపాధ్యాయుని పాత్ర పోషించి ఉద్దీపకం వర్క్ బుక్ సంబంధించిన అంశాలు పిల్లల చేత బోర్డుపై వ్రాయించి వర్క్ బుక్ లోని ప్రతి అంశం పిల్లల ద్వారా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడంతో పిల్లలు ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు చతుర్వేద ప్రక్రియలలో వెనుకబడి ఉన్నట్లు ఆయన గమనించి అసంతృప్తి వ్యక్తం చేస్తూ నెల రోజుల తర్వాత తప్పనిసరిగా ఈ పాఠశాలను సందర్శిస్తానని ఈ లోపల పిల్లలందరూ ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు తప్పనిసరిగా ప్రతి పిల్లవానికి తెలిసి ఉండాలని, ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ ప్రతిరోజు సక్రమంగా జరగాలని అన్నారు. పిల్లల హాజరు శాతం కూడా చాలా తక్కువగా ఉందని పిల్లలందరూ పాఠశాలకు వచ్చేలా సంబంధిత ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఈసారి ఈ గ్రామం సందర్శించినప్పుడు తప్పనిసరిగా గ్రామంలోని పెద్దలు, పిల్లల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానని ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వాహణ తప్పనిసరిగా పిల్లలు అర్థం చేసుకొని రాసేలా ఉపాధ్యాయులు పిల్లలను ఉత్తేజపరచాలని, సంబంధిత ఎస్సిఆర్పి ఈ పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఎస్ సి ఆర్ పి జయ ప్రకాష్, ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ఎం నరసింహారావు, ఉపాధ్యాయుడు మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేట కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్

- యస్.ఐ. సాయి కిషోర్ రెడ్డి



**దమ్మపేట, డిసెంబర్ 19,(ప్రజాజ్యోతి):** డిసెంబర్ 21వ తేదీన దమ్మపేట కోర్టు ప్రాంగణంలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించబడనున్నదని దమ్మపేట ఎస్.ఐ. సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.ఈ జాతీయ మెగా లోక్ అదాలత్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, పెట్టి కేసులు, రోడ్డు ప్రమాద (యాక్సిడెంట్ ) కేసులు, చీటింగ్ కేసులు, కాంపౌండబుల్ కేసులు తదితర పెండింగ్ కేసులను రాజీ మార్గంలో సత్వరంగా పరిష్కరించుకునే అవకాశం కల్పించబడుతుందని ఆయన పేర్కొన్నారు.దమ్మపేట మండల ప్రజలందరూ ఈ మెగా లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, కోర్టుల చుట్టూ తిరగకుండా తక్కువ ఖర్చుతో తమ కేసులను పరిష్కరించుకోవాలని ఎస్.ఐ. సాయి కిషోర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ లోక్ అదాలత్ ప్రజలకు వేగవంతమైన, సులభమైన న్యాయ పరిష్కారానికి ఉత్తమ వేదికగా నిలుస్తుందని తెలిపారు.

## సరస్వతి శిశు మందిర్‌కు కెమిస్‌ట్ అండ్ డ్రగ్గిస్‌ట్ అసోసియేషన్ భద్రాచలం మహిళా సభ్యుల విరాళం

**భద్రాచలం, డిసెంబర్ 19 ,ప్రజాజ్యోతి :** కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భద్రాచలం మహిళా సభ్యులు నిర్వహించుకునే కిట్టి పార్టీ ద్వారా సేకరించిన నగదు నుండి 15 వేల రూపాయల విలువైన 140 రగ్గులు శుక్రవారం సరస్వతి శిశు మందిర్ అవాస విద్యాలయం విద్యార్థులకు అందజేశారు. గతంలో కూడా కెమిస్‌ట్ మహిళలు ప్రభుత్వ స్కూల్స్ లో విద్యార్థులకు కావలసిన స్టడీ మెటీరియల్స్ హాస్టల్లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శిశుమందిర్ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ అధ్యాపకురాలు గీతా మేడమ్ కెమిస్‌ట్ అండ్ డ్రగ్గిస్‌ట్ అధ్యక్షులు సోమశేఖర్ పరిమి అధ్యాపక సిబ్బంది కెమిస్‌ట్ మహిళా సభ్యులు పాల్గొన్నారు.



# తిరుమలగిరి వద్ద పచ్చదనం పై నైనిక రజువా ప్రచారం

- భక్తులకు అవగాహన
- పలువురిచే ప్రశంసలు అందుకున్న ప్రకృతి హరితదీక్షకురాలు



**కొత్తగూడెం డిసెంబర్ 19(ప్రజాజ్యోతి):**నిత్యం లోకనాయకుడి నామస్మరణతో మారుమ్రోగిపోయే తిరుమల కొండల్లో ప్రకృతిని కాపాడండంటూ ప్రకృతి హరితదీక్షకురాలు నైనిక చేసిన వినూత్న ప్రచారానికి ప్రశంసల జల్లు కురుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న నైనిక రజువా శ్రీనివాసుడి దర్శనార్థం తిరుమలకు చేరుకున్న సందర్భంగా అలిపిరి వద్ద నుంచి మెట్ల మార్గంలో నడుచుకుంటూ కొండపైకి చేరుకుంది. ఈ క్రమంలోనే వీపునకు మొక్కను తగిలించుకుని, ముఖానికి ఆక్సీజన్ మాస్క్ పెట్టుకుని... నేడు మనం మొక్కలను నాటి వాటిని సంరక్షించకపోతే భవిష్యత్తులో మనం ఇలా మొక్కలను వీపుకు తగిలించుకునే పరిస్థితి వస్తుందంటూ 3,550 మెట్లు ఎక్కి చేసిన వినూత్న ప్రచారానికి భక్తుల నుంచి సానుకూల స్పందన లభించింది. మెట్లమార్గంలో అలిపిరి, హనుమాన్ ఆలయం, మోకాళ్ల పర్వతం ప్రాంతాల్లో భక్తులు నైనిక రజువా చేపట్టిన ప్రచార వివరాలను అడిగిమరీ తెలుసుకుని నైనిక చేసిన ప్రయత్నాన్ని అభినందించారు. భక్తులకు పచ్చదనం ప్రాధాన్యతను వివరిస్తూ, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవడం ఎంత అవసరమో వివరించింది. తిరుమల చేరుకున్న అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకొని పచ్చదనాన్ని పెంపొందించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేసింది. తిరుమల ప్రాంగణంలో స్వామివారి సన్నిధిలో మారేడు, సింధూరపు మొక్కలను నాటింది. చిన్న వయసులోనే పర్యావరణంపై చూపిన ఈ చైతన్యానికి భక్తులు, స్థానికులు ప్రశంసలు కురిపించారు.

**సైన్స్ ఫెయిర్, సీఎం సభలోనూ...**

ఇటీవల సెయింట్ మేరీస్ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి 2025–26 సైన్స్‌ఫేర్‌లోనూ నైనిక రజువా తన ప్రదర్శనతో పలువురి ప్రశంసలు అందుకుంది. ‘‘మొక్కలు నాటకపోతే భవిష్యత్తులో మొక్కను వీపున మోయాల్సి వస్తుంది’’ అని చెప్తూ నైనిక చేసిన ప్రయత్నాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ నైనికను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ఇటీవల పాల్వంచలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలోనూ నైనిక చేపట్టిన మొక్కల పరిరక్షణ ప్రచారం ప్రత్యేక గుర్తింపు పొందింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొక్కలు నాటాలని, వాటిని కాపాడుకోవాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నైనిక ధృఢ నిశ్చయంతో ఉంది. ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు, మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీచే ప్రశంసలందుకున్న కొత్తగూడెం పట్టణానికి చెందిన సింగరేణిన్ మొక్కల రాజశేఖర్ వద్ద ప్రకృతి హరిత దీక్ష తీసుకున్న నైనిక గత కొన్ని నెలలుగా ప్రత్యేక రోజులలో విరివిగా మొక్కలు నాటడం, మొక్కలను బహుమతిగా ఇవ్వడం చేపడుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ‘‘ఏక్ పేడ్ మా కీ నామ్’’ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని, సభలు, సమావేశాలు, పుట్టినరోజులు, పెళ్లిరోజు వంటి శుభకార్యక్రమాల్లో గిఫ్టుల స్థానంలో మొక్కలను బహుమతిగా ఇవ్వాలని ప్రచారం చేస్తోంది. ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, స్టీల్ గ్లాసులు, బాటిళ్లలో నీరు తాగితే ఆరోగ్యంగా ఉండొచ్చని ప్రజలకు అవగాహన కల్పిస్తోంది.

**మొక్కలు నాటితేనే భవిష్యత్తు పచ్చగా ఉంటుంది: నైనిక రజువా**

ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి.. నేడు మనం నాటే మొక్కలే భవిష్యత్తు తరాలకు పచ్చదనాన్ని, ఆక్సీజన్‌ను, నీడను, ఇతర వనరులను అందిస్తుంది. నేటి బాల బాలికలు ఎదిగేసరికి ప్రకృతి అంతా నాశనమై ఆక్సీజన్ కూడా దొరకని పరిస్థితి ఉంటుంది. మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా ఆ మొక్కను సంరక్షించే బాధ్యత కూడా తీసుకుంటేనే ఆ మొక్క కాస్తా మహావృక్షం కాగలదు. ఎవరికి వారు స్వచ్ఛందంగా నెలలో ఒక్కరోజైనా మొక్కలు నాటడానికి సమయం కేటాయించుకోవాలని తెలిపింది.

# దమ్మపేటలో పండుగల వేళ పోలీసుల ప్రత్యేక నిఘా

- నూతన సంవత్సరం,సంక్రాంతి వేడుకల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**దమ్మపేట, డిసెంబర్ 19 (ప్రజాజ్యోతి):**రాబోయే నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల నేపథ్యంలో దమ్మపేట మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని దమ్మపేట ఎస్.ఐ. సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “పండుగలు లేదా ఇతర కారణాల వల్ల తమ ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లే వారు, ముందుగా ఆ ఇళ్ల వివరాలను దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలి. అట్టి ఇళ్ల వద్ద పాయింట్ బుక్ ఓపెన్ చేసి నిఘా ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.అలాగే రాబోయే సంక్రాంతి,నూతన సంవత్సర వేడుకల సందర్భంగా దమ్మపేట మండల పరిధిలో కోడిపందాల శిబిరాలు, పేకాట శిబిరాలు లేదా ఇతర జూద కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. జూద క్రీడలకు పాల్పడే వారిపై ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలందరూ పోలీస్ శాఖ సూచనలను గమనించి, చట్టాన్ని పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఎస్.ఐ. సాయి కిషోర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# జనసంద్రంగా మారిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసం

- సర్పంచుల అభినందన సభలో అభివృద్ధి హామీ
- పదవి ఒక వరం.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి” మంత్రి తుమ్మల

**దమ్మపేట, డిసెంబర్ 19 (ప్రజాజ్యోతి):**దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు నివాసం గురువారం ఉదయం జనసంద్రంగా మారింది. ఆయన సొంత నియోజకవర్గంగా గుర్తింపు పొందిన సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు అశ్వరావుపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మంత్రి నివాసంలో సందడి నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన సర్పంచుల అభినందన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ,పదవి ఒక వరం. ప్రజలు నమ్మకంతో మిమ్మల్ని గెలిపించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి. గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే మీ ప్రధాన లక్ష్యంగా ఉండాలి అని నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు సూచించారు.గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రభుత్వపరమైన సహాయ సహకారాల విషయంలో తాను పూర్తిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తనకు రాజకీయ జన్మనిచ్చిన సత్తుపల్లి నియోజకవర్గం,అశ్వరావుపేట నియోజకవర్గం అభివృద్ధిలో ముందుండాలన్నదే తన ఆకాంక్ష, కోరిక అని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల మన్ననలు పొందితేనే రాజకీయాల్లో సుదీర్ఘకాలం మనుగడ సాధ్యమవుతుందని, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని హితవు పలికారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఇదే సమయంలో దమ్మపేట పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన పగడాల రమాదేవి–రాంబాబు, ఉపసర్పంచ్ అంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, చాట్ల శ్రీను, బత్తుల సాయి, బద్దె వెంకటలీల, దాసరోజు సరిత, చిన్నశెట్టి నాగలక్షి , అభ్యర్థులు పిట్టల శ్రీనివాసరావు, చిలకా శ్రీను తదితరులు మంత్రి తుమ్మల ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. దమ్మపేట మండల కేంద్రాన్ని సమస్యలులేని గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆలపాటి ప్రసాద్ , కె.వి. సత్యనారాయణ, అచ్యుతరావు,పైడి వెంకటేశ్వరరావు ,కక్కిరాల రమేష్, అత్తులూరి వెంకట రామారావు, చిన్నశెట్టి చిట్టిబాబు, వనమా శ్రీనివాసరావు, గొల్లపల్లి కోటి, చవ్వా పోలయ్య, అంగోతు బాలాజీ, దేవయ్య, కందుల వెంకటేశ్వరావు, మారుబోయిన సాయి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రియుడితో కలిసి భర్తను హత మార్చిన భార్య అరెస్ట్

- ఆమె తో పాటు ప్రియుడు, అతని స్నేహితులు అదుపులో
- విలేకరుల సమావేశంలో డి ఎస్ పి వెల్లడి



**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 19,ప్రజాజ్యోతి:**తమ అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడన్నా కారణంగా, ప్రియుడు అతని స్నేహితులతో కలిసి భర్తను హత మార్చిన భార్యను, నిందితులు గా ఉన్న ముగ్గిరిని అరెస్ట్ చేసి కోర్టు కు తరలించినట్లు స్థానిక డి ఎస్ పి సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో కేసు కు సంబందించిన వివరాలను తెలిపారు.పట్టణ పరిదిలోని వెంగళరావు కాలనీ కి చెందిన ధరవత్ హరినాద్ (39) ఈ నెల 15వ తేది తెల్లవారుజామున సుమారు 02:00 గంటల సమయంలో, తన ఇంటి వెనుక భాగంలో స్లాబ్ కింద ఉన్న హుక్‌కు చీరతో ఉరి వేసుకుని అనుమానాస్పదంగా మరణించాడు. అయితే మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, మృతుని భార్య శృతిలయ ములుగు జిల్లా, వాజేడు వెంకటాపురం ఏరియాలో అటవీ శాఖలో బీట్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తోందని, గతంలో ఆమె చర్ల ఏరియాలో డ్యూటీ చేస్తున్న సమయంలో, అదే ఏరియాకు చెందిన కౌశిక్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి, వారి మధ్య అక్రమ సంబంధం ఉన్నట్లు ఆరోపణ ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు జరిగినప్పటికీ, భార్య ప్రవర్తనలో మార్పు రాలేదని, తన కొడుకు మృతికి తన కోడలు అయిన శ్రుతిలయ కారణం అయిఉంటుంది అని ఫిర్యాదు ఇవ్వగా అదే రోజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టటం జరిగిందన్నారు. ,విచారణలో మృతుని భార్య శృతిలయ ను విచారించగా పొంతనలేని సమాదానాలు చెప్పగా అనుమానంతో పూర్తి విచారణ చేపట్టగా విచారణలో ఇది హత్య చేసి ఆత్మహత్యగా నాటకం చేసిన కేసుగా గుర్తించటం జరిగిందన్నారు. మృతుడు ధరవత్ హరినాద్ ను అతని భార్య దరావత్ శ్రుతిలయ (36) తన ప్రియుడు కొండా కౌషిక్, అతని స్నేహితులైన మోహన్, భానులతో కలిసి హత్య చేసినట్లు ఒప్పుకున్నదని తెలిపారు. ఆ రోజు రాత్రి మద్యం మత్తులో నిద్రిస్తున్న భర్తను గొంతు నులిమి హతమార్చి, తరువాత ఎవరికి అనుమానం రాకుండా ఇంటి వెనుక భాగంలో స్లాబ్ హుక్‌కు ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకొని చనిపోయినట్లు సృష్టిచడం జరిగిందన్నారు. ఈ కేసు కు సంబందించిన నిందితులను అరెస్ట్ చేసి నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సి ఐ సతీష్, ఎస్ ఐ సుమన్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# 23, 24 తేదీల్లో బ్యాట్మెంటన్ క్రీడాకారులతో అవుట్ డోర్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్

**భద్రాచలం, డిసెంబర్ 19,ప్రజాజ్యోతి :**భద్రాచలం ఐటీడీఏలో ఈ నెల 23, 24 తేదీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా లోని బ్యాట్మెంటన్ క్రీడాకారులతో అవుట్ డోర్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడలలో పాల్గొనే బ్యాట్మెంటన్ క్రీడాకారులు ఎంట్రీ ఫీజు 500 రూపాయలు చెల్లించాలని, ఎంట్రీ ఫీజు కట్టిన వారు తమ పేరుతో పాటు, తమతో పాల్గొనే పార్ట్నర్ పేరు తెలిపి, ముందు తెలిపిన పార్ట్నర్ తో మాత్రమే ఈ క్రీడలలో పాల్గొనాలని ఆయన అన్నారు. ఈ బ్యాట్మెంటన్ క్రిడలు అవుట్డోర్ క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని, ఇండోర్ క్రీడకారులకు పాల్గొనే అవకాశం లేదని ఆయన అన్నారు. ఆసక్తిగల బ్యాట్మెంటన్ క్రీడాకారులు తమ ఎంట్రీ ఫీజు ఈనెల 22వ తేదీ రాత్రి 10 గంటల వరకు 9948839775, 9 6 7 6 3 9 10 61 ఫోన్ నెంబర్లకు ఫోన్ పే ద్వారా 500 రూపాయలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలుపుతూ, ఇతర వివరములకు పై నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవాలని ఆయన కోరారు.

# గురువాయిగూడెంలో వృద్ధుడు ఆత్మహత్య

**దమ్మపేట, డిసెంబర్ 19 (ప్రజాజ్యోతి):**దమ్మపేట మండలం, గురువాయిగూడెం గ్రామానికి చెందిన కుర్సం వీరస్వామి (80) కుటుంబ వివాదాల నేపథ్యంలో మద్యం మత్తులో తెలియని కలుపు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన డిసెంబర్ 19 ఉదయం 8 గంటల సమయంలో చోటుచేసుకుంది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల మేరకు, మృతుడు కుర్సం వీరస్వామి గురువాయిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి కాగా, కుటుంబ వివాదాల కారణంగా మద్యం మత్తులో కలుపు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.అస్వస్థతకు గురైన ఆయనను దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఉదయం 8.30 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నెం. 325/2025, యు/ఎస్ 194 బి.ఎన్.ఎస్.ఎస్ కింద దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.